క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అడ్డాడ(పామర్రు): ఎంతో ప్రాశస్త్యం కలిగిన గంగానమ్మ తల్లికి ఆలయ నిర్మాణ పనులకు మండల పరిధి అడ్డాడ గ్రామంలో గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పామర్తి త్రినేత్రి పాల్గొని దంపతులుగా భూమి పూజలను చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ సుమారు రూ.20 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. నీటి మట్టం ఎత్తు వరకు పిల్లర్లు పోసి దానిపై ఆలయాన్ని నిర్మిస్తామన్నారు. ఐనంపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు బలుసు హరికిరణ్, గ్రామ ఉప సర్పంచ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సొసైటీకి విద్యార్థుల విరాళం



పామర్రు: స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 1–5వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు అందరూ కలిసి మొవ్వకు చెందిన సంజీవరెడ్డి మెమోరియల్ సోషన్ సర్వీస్ సొసైటీకి వారు దాసుకున్న రూ.4వేలను గురువారం విరాళంగా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పామర్రులోని మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులు సొసైటీకి రూ.4వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎంఈవో పి. విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే దాతృత్వ గుణాలను అలవర్చుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. విరాళాన్ని సొసైటీ ఎండీ విజయలక్ష్మికి అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్‌కే ముస్తఫా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం



గుడివాడటౌన్ : ప్రతి విద్యార్థికి బ్యాంకింగ్ విధానం, వాటి ప్రయోజనాలు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడివాడ చీఫ్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఆంధ్ర నలంద మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బ్యాంకులో పొదుపుచెయ్యడం వాటిని వివిధ ఖాతాలలో మలుచుకోవడం వంటి అంశాలపై అవగాహన ఉండాలన్నారు. బ్యాంకు విశిష్టత తెలుసుకోవడం వలన భవిష్యత్‌లో వారు ఆర్థిక మోసాలను గ్రహించగలుగుతారని సరైన విధానంలో సొమ్మును భద్రపర్చుకోగలుగుతారన్నారు. అనంతరం 10వ తరగతికి చెందిన 82 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచారు. వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. డెప్యూటీ మేనేజర్ బీటీ వీహెచ్ కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. లక్ష్మీ స్రవంతి పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట



పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం శివారు ముదిరాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మితమైన రామాలయంలో శ్రీ హనుమంతు లక్ష్మణ సీత సమేత రామచంద్రస్వామి, వినాయకస్వామి, సాయిబాబా నూతన విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం గురువారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం యంత్ర స్థాపన, విగ్రహాల ప్రతిష్ట, కళాన్యాసం, కుంభాభిషేకం, పూర్ణాహుతి అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు స్థానికులు కలిసి ఘనంగా శాలువాలతో పుష్పమాలలతో సన్మానించి స్వామివారి దీక్ష వస్త్రాలను అందజేశారు. మండల జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, వెంకట మస్తాన్‌రావు దంపతులు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ పాల్గొని విశేష పూజలను చేశారని అన్నారు.

మొవ్వ ఎస్టీ కాలనీలో అగ్ని ప్రమాదం

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఎస్టీ కాలనీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. మొవ్వ ఫైర్ అధికారి కె. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ఎస్టీ కాలనీకి చెందిన కట్టా నాగేశ్వరరావు తాటాకు ఇంటికి వంట చేసి పొయ్యి ఆర్పకపోవటం వలన ప్రమాదం సంభవించిందన్నారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారన్నారు. దీంతో భారీ ఆస్తినష్టం వాటిల్లలేదని వివరించారు. ఈ ప్రమాదంలో 20వేల ఆస్తినష్టం వాటిల్లిందని వివరించారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- గుడివాడ–పోలుకొండ–కానుకొల్లు రోడ్డు విస్తరణ పనులకు మోక్షం
- ఎమ్మెల్యే కొడాలి నాని చొరవతో వేగంగా పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అంబేడ్కర్‌నగర్ వద్ద చురుగ్గా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



లింగవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

గుడివాడరూరల్: గుడివాడ–పోలుకొండ–కానుకొల్లు రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం లభించింది. గుడివాడ నుంచి పోలుకొండ వరకు 13 కిలోమీటర్ల మేర ఉన్న జీపీకే రహదారి నిర్మాణానికి 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిధులు మంజూరయ్యాయి. గుడివాడ నుంచి లింగవరం వరకు ఒక రీచ్, అంబేడ్కర్ నగర్ నుంచి పోలుకొండ వరకు 2వ రీచ్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును విస్తరించారు. రోడ్డు నిర్మాణాన్ని సైతం పూర్తి చేశారు. అయితే లింగవరం నుంచి అంబేడ్కర్‌నగర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు మాత్రం చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా దీనిని పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా పనులు చేపట్టలేదు. అయితే 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత మేర విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి పనులు చేపట్టారు. నిర్మాణ పనులు జరగకముందే కాంట్రాక్టర్ పనులు చేయకుండా పలాయనం చిత్తగించారు.

ఎమ్మెల్యే కొడాలి నాని చొరవ..

రోడ్డు సమస్యను స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) దృష్టికి పరిసర ప్రాంతాల ప్రజలు తీసుకెళ్లారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని రోడ్డు విస్తరణ పనులకు చొరవ చూపారు. రోడ్డు నిర్మాణాన్ని మధ్యలో ఆపేసిన కాంట్రాక్టర్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్ రద్దు చేసి, మరొక కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణ బాధ్యతలు అప్పగించేలా కొడాలి నాని సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో మాట్లాడారు. నూతనంగా కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం రోడ్డు 3.66 మీటర్ల మేర వెడల్పు ఉన్న రోడ్డును 7మీటర్ల మేర పెంచే పనులను శరవేగంగా సాగిస్తున్నారు. 1.69 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు వెడల్పు పనులను చేస్తున్నారు. పనులను రూ.2.96కోట్ల నిధులతో చేపడుతున్నారు. గుడివాడ నియోజకవర్గ ప్రజలే కాకుండా కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణ విస్తరణ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు తండ్రి.. నేడు తనయుడు..



నాడు వైఎస్సార్, నేడు జగన్‌మోహన్‌రెడ్డితోనే రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో గుడివాడ నుంచి కానుకొల్లు వరకు నాలుగు రీచ్‌ల్లో మూడు రీచ్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. మధ్యలో ఒక రీచ్ రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకున్న నాధుడే లేడు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉన్నా ఏ రోజు రోడ్డు విస్తరణ పనులను చేపట్టలేదు. మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రోడ్డు విస్తరణకు నిధులు మంజూరయ్యాయి.

– పిల్లా మాణిక్యం, ఎంపీటీసీ సభ్యురాలు, తమిరిశ

పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలుండాలి

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- కూచిపూడి పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, ఎస్పీ జాషువా

కూచిపూడి(మొవ్వ): పోలీసులకు, ప్రజలకు మంచి సత్సంబంధాలు ఉండాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆకాంక్షించారు. మొవ్వ మండలం కూచిపూడిలో పోలీస్ స్టేషన్ నూతన భవన భూమి పూజ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జిల్లా ఎస్పీ పి. జాషువాలు పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గ పరిధిలోని పెదపారుపూడిలో నూతన పోలీస్ స్టేషన్ ఇప్పటికే నిర్మించామని, కూచిపూడి, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల్లో పోలీస్ స్టేషన్‌లు నిర్మించాల్సి ఉందన్నారు. ఎన్నటి నుంచో మాటలకే పరిమితమైన కూచిపూడి పోలీస్ స్టేషన్ నిర్మాణం కార్యచరణ దాల్చటం ఆనంద దాయకమన్నారు. పార్టీలకు అతీతంగా స్టేషన్ నిర్మాణానికి దాతలుగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. తొలి అడుగుగా 5లక్షలు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి అందించారు. అలాగే అతి త్వరలో రానున్న మూడు నెలల్లో స్టేషన్ నిర్మాణం చేపడతామన్నారు.

ప్రజల కోసమే..

జిల్లా ఎస్పీ జాషువా మాట్లాడుతూ ఆల్ ఇన్ సింగిల్ విండో విధానం ద్వారా పోలీసులు ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తాము పనిచేసేది ప్రజల కోసమే అని ప్రజలు పోలీసులను తమ స్నేహితులుగా పరిగణించాలన్నారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ ద్వారా పరిధిలోని సుమారు 70వేల మందికి శాంతి భద్రతలు, సేవలు అందించే విధంగా విశాలమైన పోలీస్ స్టేషన్ ఏర్పాటు 27 సెంట్లలో చేస్తున్నామన్నారు. అనంతరం స్టేషన్ నిర్మాణానికి స్థల దాతలైన బలరామయ్య, గోలపాలకృష్ణను ఎమ్మెల్యే, ఎస్పీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ వెలగం వెంకట రమణ, అడిషినల్ ఎస్పీ ఎస్. రామాంజనేయులు, డీఎస్పీలు ఎస్. సత్యానందం, ఎండీ మహబూబ్ భాషా, సీఐ ఎన్‌వీ నారాయణ, కూచిపూడి ఎస్ఐ డి. సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. మండలంలోని బొమ్మినంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సామూహిక సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ నిధులతో సమస్యలను కొంత మేర పరిష్కరించుకోవచ్చన్నారు. బొమ్మినంపాడులో సైతం ప్రజల ఆకాంక్ష మేరకు పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి అరుణకుమారి వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, పార్టీ నేతలు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, పేరే రామకృష్ణ, యర్రా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జయమంగళ నివాసం వద్ద కోలాహలం



మీసాల వెంకన్న దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ

కైకలూరు: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో నామినేషన్ గురువారం అందించారు. ఈ సందర్భంగా ఉదయం కైకలూరు మండలం ఆటపాకలో జయమంగళ నివాసం కోలాహలంగా మారింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ ముందుగా కైకలూరులో మీసాల వెంకన్న దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జయమంగళ మద్దతుదారులు, కార్యకర్తలు, అభిమానులు 40 వాహనాలలో నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. బీసీలకు అందిస్తున్న అరుదైన గౌరవంగా ఎమ్మెల్సీగా తనను ప్రకటించడాన్ని భావిస్తున్నానని జయమంగళ అన్నారు. రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సైదు గాయత్రి సంతోషి, సయ్యపురాజు గుర్రాజు, కొల్లేరు గ్రామాల పెద్దలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభమైన లూర్థుమాత మహోత్సవాలు



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం వెన్ననపూడి గ్రామంలోని లూర్థుమాత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. విచారణ గురువు కూచిపూడి ప్రశాంత్ తొలి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లూర్థుమాత స్వరూపాన్ని పల్లకీపై ఉంచి గ్రామ వీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రశాంత్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ మహోత్సవాలు నిర్వహిస్తామని ఇందులో భాగంగా తొలిరోజు లూర్థుమాతను గ్రామ ప్రజల ఆశీర్వచనార్థం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామని దీనితో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృశింహస్వామి కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం వీర ఫణి శ్యాంకుమార్, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి 3వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వింజరంపాడు(పెదపారుపూడి): మండలంలోని వింజరంపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఎస్ఎఫ్ఎఫ్ గంగరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయటం ద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. 32 రకాల విత్తనాలతో సాగు చేయటం ద్వారా నేల సారవంతమై జీవ వైవిద్యం, సేంద్రియ కర్బనం పెరుగుతుందని తద్వారా పంటలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు భూమికి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ కొడవల్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి చర్యలు



సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పసుమర్రు(పామర్రు): గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. పామర్రు మండలం పసుమర్రు సచివాలయం పరిధిలోని పసుమర్రు, కాపవరం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతి గృహానికి ప్రభుత్వం గత మూడున్నర ఏళ్లుగా అందించిన సంక్షేమ పథకాల పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మత ప్రాంత పార్టీ అని భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని అన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పీ రత్నకుమారి, తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పెయ్యలరాజు, నవుడు సింహాచలం, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, కొణతం శ్రీనివాసరావు, కొలుసు కోటేశ్వరరావు, పామర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

పామర్రు(పమిడిముక్కల): స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చొరవతో ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారం అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. పలు గ్రామంలోని శ్మశాన వాటికలకు వెళ్లే రహదారులను ఎమ్మెల్యే నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. పమిడిముక్కల మండలంలోని గుర్రాలలంక, ఎన్టీఆర్ కాలనీ, వీరంకి గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటికకు వెళ్లే దారి సక్రమంగా లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ రహదారుల ఏర్పాటుకు రూ.7లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో రహదారుల పనులు చేపట్టారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వీకేఆర్ ఫెస్ట్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడటౌన్ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వీకేఆర్ ఫెస్ట్‌లో ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు తెలిపారు. గురువారం కళాశాల కార్యాలయంలో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజినెస్ క్విజ్ విభాగంలో తమ విద్యార్థులు బి. రచన, ఎం. వరలక్ష్మి, పి. సూర్యనారాయణ, సీహెచ్ లక్ష్మీ శ్రీనివాస్, కె. కుసుమ, వి. శైలజ, ఎం. మహేశ్వరిలు ప్రథమ స్థానం సాధించారన్నారు. పేపర్ ప్రజెంటేషన్‌లో ఎం. శరణ్యసాయి ప్రథమ బహుమతి సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం. శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

గుడివాడటౌన్ : పురపాలక సంఘ పరిధిలోని జగనన్న కాలనీల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా అధికారులు ప్రోత్సహించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) పి. శివరామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ అమెనిటీస్, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పనులు ఈ వేసవిలో పూర్తిచెయ్యకుంటే వర్షాకాలం నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడతాయన్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఇళ్ల నిర్మాణం పూర్తిచెయ్యాలనే లక్ష్యంగా పెట్టుకున్నందున సంబంధిత అధికారులు లబ్ధిదారులకు కావలసిన అన్ని వసతులు పూర్తిచేసి నిర్మాణాలు పూర్తిచెయ్యాలని సూచించారు. హౌసింగ్ డీఈఈ రామోజీ నాయక్, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నిర్మాణాలు

అడ్డాడ(పామర్రు): జగనన్న కాలనీలో గృహనిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని సర్పంచ్ పి. త్రినేత్రి అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆమె గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో మొత్తం 75 గృహాల నిర్మాణం పనులు ప్రారంభించామన్నారు. వీటిలో ఇప్పటి వరకు 65 ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయని అన్నారు. మిగిలిన వాటిలో కూడా నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

గుడివాడటౌన్(నందివాడ): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కనెక్షన్‌లు తొలగించడంతో పాటు జరిమానాలు, శిక్షలు ఉంటాయని ఎలక్ట్రికల్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు అన్నారు. నందివాడ మండలంలోని వివిధ ప్రాంతాలలో 49 మంది సభ్యుల బృందాలు అనుమానిత కనెక్షన్‌లపై ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం నందివాడ కొండపల్లి కన్వెన్షన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నందివాడ మండలంలోని గృహాలు, వాణిజ్యం, ఆక్వా సముదాయాలపై ఈ దాడులు నిర్వహించామన్నారు. మొత్తం 2211 గృహాలు 278 వ్యాపార సంస్థలు, 267 ఆక్వా సముదాయాలపై ఈ దాడులు చేశామన్నారు. ఇందులో 183 సర్వీసులు అదనపు లోడ్‌లు, అక్రమ విద్యుత్ వాడకాన్ని గుర్తించామని, వీరి నుంచి రూ. 7.36లక్షలను అపరాధ రుసుంగా వసూలు చేశామన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని వాటికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా అక్రమ వినియోగం జరుగుతున్నట్లు ఎవరు గుర్తించినా 9440812362, 9440812363, 8331014951లకు సమాచారం ఇవ్వవలసిందిగా ఆయన కోరారు. సమావేశంలో గుడివాడ డివిజన్ ఈఈ టి. రామకృష్ణ, డీఏఈ జి. వెంకటేశ్వర్లు, ఏఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి నామ సంకీర్తన

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్ పిన్నమనేని నగర్‌లో వేంచేసియున్న ద్వారకాలయ శ్రీ షిర్డీ సాయి మందిరంలో గురువారం సాయినామ సంకీర్తన ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబావారి సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి గురువారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. రోడ్లపై ఈ సమారాధన కార్యక్రమం నిర్వహించడం ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో ఆలయాన్ని ఆనుకుని భోజనశాల నిర్మిస్తున్నామన్నారు. ఆలయాభివృద్ధిలో భాగస్వాములైన భక్తులు భోజనశాల నిర్మాణంలో సైతం సహాయ సహకారాలు అందించాలని కోరారు. భక్తబృంద సభ్యులు ఎస్. కోటేశ్వరరావు, వై. గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



భైరవపట్నం, శోభనాద్రిపురం, మండవల్లి, ఎంఈవో కార్యాలయాలో మహిళలను సత్కరిస్తున్న యుటీఎఫ్ నాయకులు

మండవల్లి: మండవల్లి యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక మహిళా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను యూటీఎఫ్ నాయకులు గురువారం సత్కరించారు. భైరవపట్నం యూపీ స్కూల్‌లో బీజేఎస్ కమల, శోభనాద్రిపురం ఎంపీపీ స్కూల్‌కు చెందిన సీహెచ్ కుసుమకుమారి, మండవల్లి ఎంపీపీ స్కూల్‌లో సీహెచ్ దేవకుమారి, ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఎంవీ రత్నకుమారిలను సత్కరించారు.

సర్పంచ్‌కు సత్కారం..

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు సచివాలయం వద్ద జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జూపల్లి రాజేశ్వరీని ఘనంగా సన్మానించారు. జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాంబశివరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు

ముగిసిన లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా విరాజిల్లుతున్న వరహాపట్నం భూసమేత లక్ష్మీనృసింహ స్వామి 121వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా గురువారంతో ముగిశాయి. ఈ నెల 5 నుంచి 9వ వరకు కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు స్వామివారికి సహస్రనామార్చన, గ్రామ బలిహరణ, కొట్నాలు, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, అష్టోత్తర శతనామ పూజ, మౌన బలి, ధ్వజారోహణ వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం 2000 మందికి అన్నసమారాధన జరిగింది. రాత్రి స్వామివారికి పవళింపు సేవ జరిగింది. గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో పంట కాలువ తవ్వకం పనులు

మండవల్లి: తక్కెళ్లపాడులో ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట కాలువ తవ్వకం పనులు గురువారం నిర్వహించారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.60 వేలు నిధులతో కాలువ తవ్వకం పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 43 మంది కూలీలు పనులు చేస్తున్నారన్నారు. ఈ పనుల వల్ల పంట కాలువలు అభివృద్ధి చెంది సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. చెరువులు అభివృద్ధి చేయడం ద్వారా పశువులకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఉపాధి కూలీలు పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అరటి గెలల సంరక్షణపై రైతులకు అవగాహన



అరటి గెలల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న చందు జోసఫ్

తోట్లవల్లూరు: అరటి గెలల నాణ్యతపై రైతులు దృష్టి సారించాలని మండల ఉద్యానశాఖాధికారి చందు జోసఫ్ సూచించారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో ఉద్యానశాఖ ఆధ్వర్యాన తోటబడి కార్యక్రమం గురువారం జరిగింది. అరటి గెలల నాణ్యత సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చందు జోసఫ్ రైతులకు అవగాహన కలిగించారు. అరటి గెలలకు పాలిథీన్ కవర్లు తొడగటం ద్వారా గెలలను అధిక ఉష్ణోగ్రత నుంచి కాపాడుకోవచ్చన్నారు. కాయలపై ఎలాంటి మచ్చలు రావని, పండ్ల పగుళ్లను నివారిస్తుందన్నారు. వివిధ రకాల హానికర పురుగుల నుంచి రక్షణ కలగటంతోపాటు పురుగు మందుల వాడకం తగ్గుతుందని చందు జోసఫ్ వివరించారు. పక్షులు, జంతువుల నుంచి రక్షణ కలగటంతోపాటు సహజమైన రంగు, ఏకరీతి పరిణామంతో గెలలు పొందవచ్చన్నారు. అరటి గెల నాణ్యతతోపాటు త్వరగా పక్వానికి రావటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యానశాఖ సహాయకురాలు దీపిక, రైతులు పాల్గొన్నారు.